# మరో గాంధారి ప్రణయం

ఊయల బల్లమీద కర్చున్న రాజేశ్వరి పాదలకున్న బంగారు పట్టాలు, వ్రేళ్ళకున్న బంగారు మెట్టలు చూసుకుంటూ తలుపుతోసినచప్పుడైలత్తింది. సుందరమ్మ......కొత్తగా వేసిన మామిడిపిండెల ఆవకాయముక్కల చిన్నగిన్నెలో తీసుకోచ్చి రాజశ్శరి చేతికిచ్చింది. నీకిష్టమని........ అంది ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటు సుందరయ్య.

రాజేశ్వరి, సుందరయ్య చిన్ననాటినుంచే స్నేహితురాలు. ఇద్దరు కలిసి బి.ఏ దాకా చదువుకున్నారు. అంతస్తులు వేరైనా ఆత్మీయులు చేరువే. నాలుగిళ్ళ వెనుక ఒక చిన్న ఇంట్లో అద్దెకుంటున్న సుందరయ్య కుతురు లలిత, రాజేశ్వరి కూతురు సంధ్య ఒకే కాలేజీలో చదువుకుంటున్నారు. మంచి స్నేహితులు. ఇవాళేదో పార్టి ఆట కాలెజిలో, అదీ ఇదీ కూడా ఏదో నాటకంలో ఉన్నారట. ఆలస్యంగా వస్తామని చెప్పారు అంది సుందరమ్మ. రాజేశ్వరి మాట్లాడలేదు. ఈ మధ్య తల్లులిద్దరి మనసులు చిరాగ్గానే ఉంటున్నాయి.

అదేమిటి రాజి, నేను – ఈయన దీంతో చచ్చిపోతున్నాం అన్నుకో... ఏ సంబంధం ఒప్పుకోకపోతే ఎలా చెప్పు– మున్న వచ్చిన్న అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. కాకపోతే ఇద్దరి చెల్లెళ్ళకి పెళ్ళి చెయాలట. ఆ బాధ్యతలన్నీ ఎవరు మోయాలి? అందుకే ఆసంబంధం వద్దంటోంది లలిత. సుందరయ్య ఎంతో విచారంగా అంది. సుందరయ్య భర్త గుమస్తా. ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు చేసిన ఇంత చిరాకు పడలేదు. ఆ ఆడపిల్లలు తండ్రి మాటకు ఎదురుగా చెప్పలేదు. కానీ లలిత దగ్గరికి వచ్చేసరికి ఆ పిల పెళ్ళి పెద్ద సమస్య అయిపోయింది. ఏ సంభందం తెచ్చినా ఏదో వంక పెట్టి కాదంటుంది. ఎవరినైనా ప్రేమించిందా!? లలిత తండ్రి రాఘవరావుకి ఎంతో కోపం వచ్చింది. ఆక్షణంలో చాల్లెండి! దానికంత తెలివికూడా ఉందా? అయినా చెబితే కాదంటామా...

మనం కాదంటామా... మనం కాదంటే అది మానుతుందా" అంది సుందరయ్య.

లలిత, సంధ్య ఆరోజు బజారు నుంచి వస్తూ, మాటల్లో మునిగిపోయారు, మాటల్లో మునిగిపోయారు. "ఇక్కడ హాయిగా కాసేపు కూర్చుందాం" అంది సంధ్య గుడి మెట్లమీద కూర్చుంటూ." మానాన్న, అమ్మ నన్ను బ్రతకనీయడం లేదు. పెళ్ళి.... పెళ్ళి... అంటూ గోల గోల" అంది లలిత.
"ఏం, చేసుకోవా?" అంది సంధ్య నవ్వి.
"చేసుకుంటా. కానీ నాకు నచ్చితేనే"
"అంటే"

అదేనే అబ్బాయి బాగుండాలి, మంచి ఉద్యోగం ఉండాలి. బాధ్యతలుండ కూడదు- ఇంకా లలిత అలా అంటూంటే సంధ్య రెప్పవేయకుండా చూసింది. "అరే" అంది చటుక్కున.... మెట్టు మీద నుంచి కిందకి పడిపోయిన అతని వంక చూస్తూ.

సంధ్య గబుక్కున లేచి అతని చేయిపట్టుకుని నిలబెట్టింది-అతను కొంచెం సిగ్గుపడుతూ, " కాలు జారింది. ఎప్పుడూ జాగ్రత్తగానే అడుగేస్తాను" అన్నాడు. సంధ్య అతని వంక శ్రద్ధగా చూసింది. " మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాను" అంటూ విజిటింగ్ కార్డ్ సంధ్య చేతికిచ్చాడు. సంధ్య తన ఫోన్ నంబర్ ఇచ్చింది. "సీ...యు...లేటరు-థాంక్స్" అన్నాడు వెళ్ళిపోతూ శ్రీధర్. కార్డ్ అటూ ఇటూ తిప్పి చూసింది సంధ్య.

"కూర్చున్న చోటనుండి లేవలేదేమిటో" అంది లలిత వైపు చూసి " కుంటి,గుడ్డి అందరిని ఉద్ధరించడం నాకు చేత కాదులే" అంది లలిత. సంధ్య మాట్లాడలేదు. లలిత మాటలు సంధ్య మనసుకి ఎంతో బాధ కలిగించాయి. లలిత పక్కున నవ్వింది. " ఏమిటా నవ్వు" అంది సంధ్య. " చెప్తా... ఈ అబ్బాయినే మావయ్య చెప్పాడు. ఒకసారి పెళ్ళిచూపులకు వచ్చాడు కూడా. అంతే కాదు సంధ్య.... ఎంతో బుద్ధిమంతుడు, ఇంద్రుడు, చంద్రుడు... అని తెగ పొగుడ్తూ, పైగా కట్నకానుకల గొడువ అక్కర్లేదు, అంటూ మావయ్య మా అమ్మని నాన్నని ఒప్పించాడు. ఇంక చూసుకో.... మావాళ్ళు నన్ను మహ వేదించారు. ఈ అబ్బాయిని పెళ్ళి చేసుకోమని" అంది పొడుగైన జడ ముందుకు తీసుకుంటూ లలిత. "ఏం చేసుకుంటే మంచిదేగా" అంది సంధ్య. "ఛీ, చాలే, నాకేం ఖర్మ. ఇలాంటి వాడిని చేసుకునెందుకు" అంది మళ్ళీ లలిత.

సంధ్య మాట్లాడలేదు. కానీ లలిత అహంకారపు మాటలు నచ్చలేదు. భగవంతుడు ఎందుకో కొందరికి కొన్ని లోపాలిస్తాడు. అంత మాత్రం చేత వాళ్ళు మహనీయులు కారా!! -సంధ్య చేతిలో విజిటింగ్ కార్డు అటూ ఇటూ కదులుతోంది. “ లలిత.... నువ్వు పొరపాటు చేశావు. దాంపత్యంలో కావలసింది ప్రేమ తర్వాతే తక్కినవన్నీ. ఏం ఇప్పుడిలా ఉన్నాం. రేపు మనకేదైన వచ్చి కన్ను, కాలు....” సంధ్య ఏమంటుందో అర్థమై “ప్లీజ్ నాకు భయంవేస్తుంది. నీ మాటలు వింటూంటే-ఏదేమైన,ఇలాంటి వాడిని భర్తగా అంగీకరించలేను. అంతే” అంది లలిత. ఇద్దరు స్నేహితులే అయిన ఆలోచన మాత్రం భిన్నం కావడం విశేషం. చాలా ఐశ్వర్యవంతుల పిల్ల సంధ్యకి వ్యక్తులపై గౌరవం, జాలి, ప్రేమ, దయ ఇలా ఎన్నెన్నో ఉన్నాయి. లలితకి అహం, గర్వం, తను చాలా అందగత్తెననే భావం విపరీతం.... స్నేహితురాళ్ళిద్దరూ నడుచుకుంటూ బయలుదేరారు.

ఇంట్లోకి సంధ్య రాగానే రాజేశ్వరి కోపంగా ఉన్నట్లు అర్థమయింది. “ అమ్మ ఎందుకో ఈ మధ్య చాలా చిరాగ్గా ఉంటోంది” అనుకుంటూ తల్లి దగ్గరకు కుర్చీ జరుపుకుంది సంధ్య. “ భోజనం చేద్దామా?” అంది “ నాకు తినాలని లేదు. నువ్వు తిను” అంది ముభావంగా.

“ఒంట్లో బాగా లేదా అమ్మా?” అంది సంధ్య. “ మనసులో - నీ పెళ్ళి నేను బ్రతికుండగా చేస్తావా అనే బెంగ! ఇప్పుడే నా ఫ్రెండ్ సుందరమ్మ వచ్చి వెళ్ళింది. దానికి ఇదే బెంగ. ఏ సంబంధం చూసిన వద్దంటుందిటగా లలిత. ఐనా లక్షలు లక్షలు పోసి ఎక్కడ తేగలరు వాళ్ళు గొప్ప గొప్ప సంబంధాలు” రాజేశ్వరి.

“ ఈ మధ్య మేనమామ ఓ సంబంధం తెస్తే చేసుకోను పొమ్మందిట - పోని అది బాగానే ఉంది!....” అంటూ తల్లి చెబుతున్న మాటలు వింటుంటే సంధ్యకి ఇందాక లలిత మీద వచ్చినంత కోపం తల్లి మీద కూడా వచ్చింది.“ ఏమిటమ్మా... వాళ్ళు మనుషులు కారా? లలిత చేసుకోనంటే నువ్వు దానికి బుద్ధి చెప్పించాల్సింది” అంది సంధ్య.

సంధ్యకు భారత రామయణాలు బాగా ఇష్టం. సినిమాలు, నాటకాలు,కథలు ఏమన్నా కాని వాటికి సంబంధించితే హాయిగా ఆనందిస్తుంది. భారతంలో గాంధరి గుర్తు వచ్చింది సంధ్యకి.... ముందు ధృతరాష్ట్రుని గురించి విని. మనసులో అతని

సౌందర్యాన్ని, అతని బలాన్ని, అతను నూరుగురు పైగా సంతానవంతుడనే విషయాన్ని తెలుసుకున్నాక అతనే తవ భర్త కావాలనుకుంది. మనసులో అతనికి ఒక స్థానం ఇచ్చేసింది. కాని మరుక్షణం అతను పుట్టు అంధుడని తెలుశాక ఆప్రేమ భావం నుంచి దూరం కాలేక అతను చూడాని లోకం తనెందుకు చూడాలని చీర కొంగు చించి కళ్ళకు గంతలు కటుకుంది!ఆ గాంధారి గొప్పది కాదా!! అంతెందుకు సవతి మాత్సర్యంలో గర్భస్థ శిశువుకు అన్యాయం చేసిన వినుత ఎంత పశ్చాత్తాప పడిందో కానీ తొడలు లేని అనూరుడు సూర్యరథసారధి కాలేదా-అవిటితనం ఒక అవయవానికే, మనసుకు, మనషికి కాదు'' - సంధ్య ఎంతో ఆవేశంగా మాట్లాడుతుంటేవిని పక్కున నవ్వింది లలిత. " చాల్లే.....నీవురాణకథలు ఆపు. నేను మాత్రం పెళ్ళి కాకుండా ఉండిపోతాను కానీ అతని మాత్రం పెళ్ళిచేసుకోను" అంది ఖచ్చితంగా.

రాజేశ్వరి బాధ వేరు. సంధ్య ఆలోచనలేవి ఆవిడకి నచ్చవు. " తెలుపుకి వ్యతిరేకం నలుపు అని అంటే ఎరుపెందుకు కాదు' అంటుంది సంధ్య..... డబ్బున్నవారికి అహంకారం ఎక్కువ అని డబ్బుకన్నా ముఖ్యమైంది మంచి మనసు అని సంధ్య భావం. ఈ మాటుకి లలిత ఎప్పుడూ నవ్వుతుంది. " డబ్బులేకపోతే లోకంలో ఏమీ లేనట్టే" అంటుంది లలిత. "పతితులారా, భ్రష్టులారా, బాధా సర్పద్రష్టులారా..... ఏడవకండి" అంటూ అందరికి కన్నీళ్ళు తుడిచి, అందరిని ఉద్ధరించు" అంటుంది లలిత - సంధ్య మాటులని హేళన చేస్తూ.

ఒక వారం రోజులు గడిచాయి. సంధ్య మనసు రకరకాలుగా ఊగిసలాడుతుంది. మనిషై పుట్టాక మరో మనిషికి చేయూత నివ్వాలి. సంధ్య ఆలోచన మధ్యలో ఆనాడు మేట్ల మీద నుంచి జారిన శ్రీధర్ గుర్తుకు వచ్చాడు. పర్స్‌లో ఉన్న విజిటింగ్ కార్డ్ వేళ్ళకి తగిలింది.

రాజేశ్వరి సంధ్యకి అమెరికాలో ఉన్న డాక్టర్‌తో సంబంధం కుదుర్చాలని ప్రయత్నం చేస్తోంది. " నా పెళ్ళి నేను కుదుర్చుకుంటా" అంది ఓ రోజు ఉన్నట్టుండి సంధ్య. రాజేశ్వరికి నోటమాటరాలేదు. " ఏమిటి?"

"అవును నాకు పాతికేళ్ళు-నీకు నేను చిన్న పిల్లనే-కానీ నిజంగా నేను చిన్నపిల్లను కాను-నా నిర్ణయాలు నావి - నా మంచి చెడ్డలు నావి" అంది తల్లితో. తల్లికి ఏమి బోధపడటం లేదు. ఎవరిని చేసుకుంటానని చెబుతుందోనని భయంతో రాజేశ్వరి ఒణికి పోయింది.

నెల రోజులు గడిచాయి. గొలుసుల ఉయ్యాల బల్ల మీద కూర్చున్న రాజేశ్వరి కళ్ళను నమ్మలేక పోతుంది. " మా అమ్మ" అంది శ్రీధర్ తల్లికి పరిచయం చేస్తూ.... ఓ పది నిమిషాలుండి శ్రీధర్ వెళ్ళిపోయాడు. " అబ్బాయి బాగానే ఉన్నాడు. కాకపోతే మేడికల్ రిప్రజంటేటివ్! ఛీ! మన స్టేటస్‌కి ఇదా సంబంధం" రాజాశ్వరి మనస్సు ఉడికిపోయింది. నిజం పూర్తిగా తెలిస్తే? " అవునే లలితా! పెళ్ళి చేసుకుంటున్నా! కఱ్ఱ కాలుంటె ప్రమాదం లేదు. కఱ్ఱ మనసుంటేనే ప్రమాదం" సంధ్యకి మాటలకి లలిత ముఖం వెలవెల పోయింది.. తను పొరపాటు చేసిందా!! కోటీశ్వరురాలు సంధ్య రేపటి నుంచి సంధ్యా శ్రీధర్ అవుతుందా? ఆ మసక చీకటిలో లలిత కళ్ళలో తిరిగిన నీటి పొరలు కనిపించక పోయినా... శ్రీధర్ కి కనిపించాయి ఆక్షణంలో!

కథ నిలయం శ్రీకాకుళం